కథా నిలయం
2276
శ్రీకాకుళం

# చీకటి వెలుగులు

అసలు నేను జీవితంలో నీతిని గురించి ఇంత ఆలోచిస్తానని, ఇంత ఆలోచించవలసిన అవసరం నా జీవితంలోనే ఏర్పడుతుందనీ ఎప్పుడూ అనుకోలేదు నేను. నా పెళ్లి అయ్యేవరకే కాదు, అయిన రెండేళ్ల దాకా కూడా అదే అభిప్రాయం. ఆ అభిప్రాయానికి అంతరాయం కలగలేదు.

నాకు బాగా గుర్తుంది ఆ రోజు. దానికి ముందటి రోజే అన్నయ్య నాతో ''పెళ్లి చూపులకి వెళ్లాలి'' అన్నాడు.

అన్నయ్య అని ఊరుకున్నాడు. కానీ నాలో ఎన్ని ఆలోచనలు! ఇదే మొదటి సారి పెళ్లి చూపులకు వెళ్లటం. ఆ అమ్మాయి చాలా బాగుంటుందని విన్నాను.

''పెళ్లి చూపులకు వెళ్లాలి—''

వెడతాను. చూస్తాను. ఆ అమ్మాయి నచ్చుతుంది. మా ఇద్దరికీ పెళ్ళయిపోతుందా? ఇంతవరకూ పరిచయమైనాలేని ఆ అమ్మాయి నాదైపోతుంది. నాకూ ఒక స్నేహం, తోడు నీడా లభిస్తాయి. నా కలలకి అర్థం దొరుకుతుంది. నా కోరికలు నెరవేరుతాయి. నా జీవితంలోకి మాధుర్యం వస్తుంది. నా బ్రతుకు పరిమళం అద్దుకుంటుంది. ఆమె నాకు భార్య అవుతుంది.

భార్య !

ఆ మాటలో ఎంత నిండుతనం ఉంది !

ఎంతటి సుఖం అవనీ ఆవిడలేకుండా అనుభవించలేను.

ఎంత దుస్థితి రానీ ఆమె భుజం మీద చేయి వేసి అవలీలగా అధిగమిస్తాను. సర్వకాల సర్వావస్థలలో ఆమె నా పక్కనే ఉండాలి. నేను ఉంటే ఆమెకు ఇంకేమీ అవసరం లేదు. నా సహచర్యంలో ఆమె తన జీవితార్థం పొందాలి. ఆమెకి

నేను ఇవ్వనిది ఏమి ఉంటుంది! ఆమె కోసం, ఆమె తృప్తి కోసం నేను చెయ్యనిది ఉండదు.

ఆమె పుట్టి ఇరవై సంవత్సరాలు, ఎక్కడో విడిగా పెరిగింది. నేను రేపు చూస్తాను ఆమెని. అప్పుడే ఆమె నాకు పరిచయమై పోతుంది. నాకు తెలుసు— ఆమె నాకు చిరపరిచితురాలై పోతుంది. ఆమె గురించి నాకు అంతా తెలుసు. ఇన్ని నాళ్ళుగా ఆమె నా రాక కోసమే ఎదురు చూస్తోంది. రేపు! ఆమెని నేను చూస్తాను. ఆమె నన్ను గుర్తిస్తుంది. ఆ గుర్తించటం— కుర్చీలో కూర్చుని, ఓరగా తల ఒంచి, అవనత వదనయై ఉండగా పెదవుల నుంచి జారి వచ్చే చిరునవ్వులో నేను చూడగలను. ఆమె నన్ను గుర్తిస్తుంది.

ఆలోచనలతో నిద్ర పట్టలేదు ఆ రాత్రి.

వచ్చినవన్నీ మధుర భావనలే. నిద్ర వచ్చేవరకూ ఆలోచనలే.

మరునాడు ఉదయం బయలుదేరి నేను అన్నయ్యా వెళ్ళాం ఆ ఊరికి. ఆ రోజు మధ్యాహ్నం స్నేహితుల ఇంట్లో ఉండి, సాయంత్రం చూడటానికి వెళ్ళాం. ఆ పెద్ద హాలులో అందరి మాటలు కానీ, గది అలంకరణ కానీ అగరువత్తుల వాసనలు కానీ నన్ను ఈ లోకంలోకి తీసుకురావటంలేదు. నేను అనంతమైన నిరీక్షణని అనుభవిస్తున్నాను. అప్పుడు ఆమె వచ్చింది. కుర్చీలో కూర్చుంది. కూర్చుని నన్ను చూసింది. చూసి చూపులు మరల్చుకుంది. ఆమె అధరం కంపించింది. చిరునవ్వు ఒకటి పెదవుల కొసల మెరిసి మాయమైంది. ఆమె నుదుట చిరుచెమట పట్టింది.

స్వర్ణం తెలుపు— తెల్లని వదనం; కురులు, కనుబొమలు, కనీనికలు, బుగ్గ మీద పుట్టుమచ్చ దిద్దినట్లున్న నలుపు. ఆ అందం నన్ను విభ్రాంతుణ్ణి చేసింది. రాత్రి, పగలు కలిసి తమ అందాలు ఒలక బోస్తున్నాయా వదనంలో. ముఖము అందానికి చంద్రబింబంలా మనోజ్ఞమే కాదు, ఆమెది సౌష్ఠవ వంతమైన మూర్తి. నేను చూపులు మరల్చుకోలేకపోయాను. మరల్చుకుని నాలో నేను నిట్టూర్పులు విడిచాను.

ఈమె నాది. ఈమెని నేను వహించాలి. ఆమె సౌందర్యం నా ఆరాధనలో, ఆమె కోరికలు నా లాలనలో – ఆమె జీవితాశయాలు నా ప్రోత్సాహంలో సార్థకం కావాలి. ఆమె తృప్తికి బాధ్యుడిని నేను!

ఈ బాధ్యత స్వీకరించటానికి నా మనసు సంతోషపడుతోంది. నా సర్వస్వం కుతూహలంతో ఆయత్తమవుతోంది. అవును, ఆ నయనాలలో ఎన్నడూ

దుఃఖాశ్రువులు చేరరాదు. ఆమె మనసులో నా యెడల అనురాగ దూరమైన భావం ఒకటీ కలుగరాదు. నాకు తెలుసు — నేను అందుకు సమర్థుడనని. ఇన్ని గుణాలు, అందం, అనురాగం సంతరించుకుని ఎదురుచూస్తున్న పురుషుడి నీడలో ఏ యువతి సుఖపడదు!

సంతోషంతో, తృప్తితో నా అంగీకారం తెలిపాను అన్నయ్యకి, ఇంటికి రాగానే. వదిన నవ్వింది. ఆ నవ్వులోని అనురాగం మనసుని తాకింది. తాకగా నాలో నిండి తొణికిన అనురాగం ఆమె దగ్గరకు ప్రవహించటానికి పరుగు పెట్టింది. ఆమె పేరు సుధ — నా జీవన సుధ.

## 2

అట్లాగ పరుగులు పెట్టింది నా హృదయం ఆ రోజులలో. అది ఆలపించింది సంగీతమో, మధుర మంజుల మురళీగానమో. ఏమి హృదయం! తాను కన్న కలలు రూపొందుతాయని భ్రమిస్తుంది. తాను ఊహించుకున్నదే నిజమౌతుందని నమ్ముతుంది. కానీ, ఆ విధంగా జరగని నాడు ఆ విఫల పరిణామం తట్టుకోలేక సంక్షోభం చెంది చెంది చితికి కన్నీరౌతుంది. కన్నీరు అంతమయ్యాక నిర్వేదం వహిస్తుంది. వైరాగ్యం సంతరించుకుంటుంది. అప్పటికీ ద్వంద్వాలకు అతీతమైందని చెప్పలేము. అది దాని గుణం కాదనిపిస్తుంది. ద్వంద్వాలకు చలించటమే దాని స్వభావం. వీటికి అతీతమైంది మేధ ఒకటే. హృదయంచే పాలింపబడేవాడు కన్నీటి కాలువకు పన్నీటి నవ్వులకు మధ్య ఊగుతూ తనకు తనే హాస్యాస్పదుడవుతూ వుంటాడు.

ఔను— నాకు నేనే హాస్యాస్పదుణ్ణిగా కనబడుతున్నాను.

ఈనాడు నాకు ఇల్లు లేదు, గమ్యం లేదు. శాంతిని వెతుక్కుంటూ అశాంతిలోకి— వయసును మించిన వార్ధక్యం వహించిన మనసుతో— ఆ రాత్రి పాడిన అనిర్వచనీయమూ, భావాతీతమూ అయిన రాగానికి దూరంగా ఎక్కడికో బయలుదేరాను నేను. అవిరామమైన సృష్టి సారథ్యం నుంచి ఒక క్షణం తొంగి చూసి దేవుడు నన్ను చూసి నవ్వుకుంటాడు.

నాకు నేనే హాస్యాస్పదుడైన మానవుడిని నేను.

## 3

సుధతో పెళ్ళి అయింది. అది మొదటి రాత్రి.

ఆ రాత్రి—

నేను ఆమె భుజం మీద చేయి వేశాను. సుధ కిటికీ లోనించి, మబ్బుల మధ్య దాగుడుమూతలాడుతూ పరిగెత్తే పూర్ణ చంద్రుణ్ణి చూస్తోంది. ''సుధా'' అన్నాను. ఆమె తన చూపులు మరల్చకుండానే ''ఆ'' అంది. ఆమె ముఖాన్ని నావైపుకు తిప్పుకున్నాను. ఆ వదనంలో ఏమి సౌందర్యం నిక్షిప్తమై ఉంది! ఆమె వాల్చుకుని ఉన్న కనురెప్పల మధ్య నీటి బిందువు ఒకటి మెరుస్తోంది. ఆ నాడు నీటి బిందువుకు కారణం గురించి నేను అనుమానించలేదు. నాకు ఆ నాడు ఆ సందేహం కలగలేదు. నీటి బిందువు! ఆ సుందర నయనాల మధ్య అందాన్ని అంది పుచ్చుకుంటోంది. నాటి అందాన్నే చూస్తున్నాను.

''ఔను, తనను అర్పించుకునే ఘడియ నిలువునా కదలిస్తుంది. అది సంతోషం, గాంభీర్యం, పారవశ్య మిశ్రితమైన అనుభూతి. తన వాడికి తనను అర్పించుకునే తమకం— ఒక కన్నీటి బిందువు కదలదా— నాకే అనురాగంతో, అనుభూతులతో కన్నులు ఆర్ద్రం అవుతుంటే...''

''సుధ నాది; ఈమె నాది. పుట్టుక వహించినది మొదలుగా నిరీక్షించి పరితపిస్తున్న రెండు ఆత్మలు ఈ వేళ సంయోగం చెందుతాయి.''

సుధని గాఢంగా హత్తుకున్నాను. సుధ నా కౌగిలిలో ఒదిగిపోయింది.

ఆ కౌగిలిలో ఒక నిట్టూర్పు నలిగిపోయింది.

ఆ రాత్రి నాకు యీ ప్రశ్న రాలేదు— సుధకు నేనేమౌతాను! ఆమెకి నా యెడల ప్రేమ వున్నదా? నన్ను వాంఛిస్తున్నదా?— అని.

ఆమె నా కౌగిలిలో ఒదిగిపోయింది. పెళ్ళి అయిన పడతి. తెలిసి వివాహం చేసుకున్న యువతి. భర్తకు తనను అర్పించుకోక ఏం చేస్తుంది! నేనే ఆమె మనసును తెలుసుకోలేకపోయాను. అనుమాన రహితమయింది నా మనసు. ఆనంద పారవశ్యం ఆవహించింది నా హృదయం. నాకు తెలిసి ఉంటే నన్ను ప్రేమించకపోవటమే కాదు, ఇంకొకరిని ఇదివరకె, వివాహానికి పూర్వమే ప్రేమించిందని నాకు తెలిసి ఉంటే! నేను సుధను తాకేవాడినా! నా తమి తీరని ముద్దులతో విసిగించే వాడినా? లాలనతో కూడిన చూపులతో వెంటాడే వాడినా? ఆమె మనసులోని సంఘర్షణని తలచుకుంటే, ఆమె పరిస్థితిని ఊహిస్తే —

ఆమెపై జాలి కలుగుతోంది— నాపై నాకే అసహ్యం కలుగుతోంది. నాపై మనసు

లేని ఆమెపై నా హద్దు లేని ప్రేమ తలుచుకుంటే సిగ్గు వేస్తోంది.

మనసు లేని ఆమెను నా ప్రేమతో ఎంతగా బాధించానో! ఎట్లా సహించింది సుధ? స్త్రీకి అంత ఓర్పు ఎట్లాగ వచ్చింది?

అందం— స్త్రీ అందం విభ్రాంతిని కలిగిస్తుంది, సమ్మోహనపరుస్తుంది. సుధకి సిగ్గు ఎక్కువ అనుకున్నాను. ఎదలో మేల్కొనే మధుర భావాలు ఆమెను మాటాడనీయకుండా చేస్తున్నాయనుకున్నాను. కనులెత్తి నా కనులతో చూపు కలపటానికి మధుర లజ్జ, వలపుతలపు అడ్డు పడుతున్నాయనుకున్నాను.

అట్లాగే అనుకున్నాను రెండేళ్ళు. అట్లాగే అనుకోకపోతే, ఆమె అందమే, నాలోని అనురాగమే నన్ను గుడ్డివాడినిగా చేయకపోతే విముఖతని నేను రెండేళ్ళలో ఒక నాడైనా చూసి ఉండేవాడిని.

రెండేళ్ళ తరవాత! ఏమైంది ఆ రోజు?

క్లబ్బులో కలుసుకున్నాను రాజుని. అతను అక్కడికి ట్రాన్స్ఫర్ అయి వచ్చి నెల అయిందిట. ఎసిస్టెంట్ ఇంజనీర్ అతడు. చాలా రోజుల తర్వాత కలుసుకున్నాం. సంతోషంగా టెన్నిస్ ఆడాం— తరవాత అలసట తీర్చుకుంటూ రాకెట్లు పడేసి లాన్‌లో కూర్చున్నాం.

''ఎక్కడ ఉంటున్నావ్?''

నా ప్రశ్నకి జవాబు చెప్పాడతను.

''పిల్లలా? ఎంతమంది? శ్రీమతి క్వాలిఫికేషన్స్ ఏమిటి?'' అడిగాను.

''ఆగాగు. అసలు శ్రీమతే లేనిదే మిగతావాటికి జవాబు లెక్కడ నుంచి తీసుకురాను!''

ముప్పై ఏళ్ళు మీద పడుతున్నాయి. ఇంకా బ్రహ్మచర్యమేనా?''

''అదృష్టం కలిసి రావద్దూ.''

''కలిసివచ్చేది ఆ అమ్మాయికి. నీకేం తక్కువ?''

నిట్టూర్పు విడిచాడు రాజు. చెప్పటం ప్రారంభించాడు.

## 4

''ఏం తక్కువ! మనిషికి ఏమిటి తక్కువ? తను కోరినది మాత్రం దొరకక పోవటం ఒకటే తక్కువ. తనకు దొరకనిదే కోరిక.'' రాజు ఒక అమ్మాయిని

ప్రేమించాడుట. అతడి చెల్లెలి స్నేహితురాలు.

''తను మా చెల్లెలు ఉష కోసం వచ్చేది. ఎదగని మనసులు ఆకర్షణలో పడిపోయాయి. కలిసి సినిమాలకి వెళ్ళటం, గంటల తరబడి కబుర్లు చెప్పుకోవటం సన్నిహితంగా తెచ్చింది మా ఇద్దరినీ.''

''వాళ్ళ తల్లిదండ్రులు తను కేవలం ఉష కోసమే వస్తోందనుకునేవారు. ఒక రోజు అమ్మ, ఉష పేరంటానికి వెళ్ళారు. ఇంట్లో నేను ఒక్కడినే ఉన్నాను. మబ్బులు వర్షించటం మొదలు పెట్టాయి. తడుస్తూ లోపలికి వచ్చింది సుధ.''

''సుధా?!'' అన్నాను ఉలికిపడి.

రాజు చెప్పుకు పోతున్నాడు—

''ఆ. తన పేరు సుధ. నిజంగా ఆ అందానికి హృదయానికి తగిన పేరు. తను లోపలికి రావటం నేను కిటికీలోనుంచే చూశాను. ఎదురుగా వెళ్ళాను. నన్ను చూసి నవ్వింది. టవల్ అందించాను. తల తుడుచుకుంటూ—

''ఉష ఏది?'' అడిగింది. చెప్పాను. కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది. చాలా ముభావంగా ఉంది.

''ఏం, అట్లా ఉన్నావ్? నన్ను చూస్తుంటే భయం వేస్తోందా?'' అన్నాను. నా వైపు చూసింది. ''నీకు తెలియదు ఆ కళ్ళలోని అందం, ఆకర్షణాను.''

సన్నగా నవ్వి ''ఔను. నా గుండెలు ఎంత వేగంగా కొట్టుకుంటున్నాయో చూడు.'' అంది.

ఆ క్షణంలో నేను పరవశించాను.

''నిజంగా చూడమంటావా?'' అన్నాను సమీపించి.

కదలకుండా అట్లాగే నిలబడింది సుధ. తప్పించుకోవాలనే ప్రయత్నం కాని, భయం కానీ కనిపించలేదామెలో నాకు.

ఆమెను కౌగిలించుకుని గాఢంగా ముద్దు పెట్టుకున్నాను. ఆమె తడిసిన జుట్టు మెరుస్తున్న కళ్ళు నాలో మత్తును నిండించాయి. నా చేతులలో ఇమిడిపోతూనే కనులు అర మూస్తూ అంది

''ఏమిటిది రాజూ— ''

అప్పుడు నాకు అర్థమయింది. సుధకి నన్ను ప్రతిఘటించాలని కూడా తెలియదు. తనకి కేవలం ఆకర్షణ తెలుసు అంతే. ఆమె వయసుకి తగిన ఆలోచన కానీ, స్త్రీ

పురుషులు, వివాహానికి సంబంధించిన జ్ఞానం కానీ లేదామెలో. తను ఆకర్షించిన వాడికి తన సర్వస్వం అనాలోచితంగా అర్పించటమే తెలుసు. పదహారేళ్ళ యువతి. తెలిసి ఉంటే, తన కులం కాని వాడిని, నా కౌగిలిలో ఇమిడి ఉండేది కాదు. ఏ మాత్రం భవిష్యత్తును గురించి ఆలోచించగల మనిషైనా, పెళ్ళి అనేది మా ఇద్దరికీ జరగటం సంభవమా అనే సంశయం వచ్చినా నన్ను తప్పించుకుని ఉండేది. నన్ను నివారించి ఉండేది. సుధకి తెలిసింది ఒకటే– ప్రేమ. అది మోహమనటానికి అప్పుడు ఒప్పుకోరు యౌవనులు. ప్రేమ అనేది వరద వెల్లువలా ఉబికితే, ఆ ప్రవాహంలో తనే కొట్టుకుపోతోంది సుధ.

నాకు అన్నీ తెలుసు. నాకూ సుధకి వివాహం జరగదనీ తెలుసు. అయినా ఆ ఆకర్షణ నన్ను బంధించివేసింది. ప్రేమానుభవంలోని లాలసను అణుచుకునే శక్తి నాకు లేకపోయింది. ప్రేమ భగ్నమయినా సరే, వివాహం కాకపోయినా, సరే– ఆ ప్రేమానుభవం నేను వదులుకోలేను. తనంతట తానుగా ప్రేమను అందించటానికి సిద్ధంగా ఉంది సుధ. ఆమె భవిష్యత్తు యొక్క శ్రేయస్సును ఆశించి నిగ్రహించుకోగల త్యాగం నాకు లేకపోయింది. లోబడిపోయాను ఆమె ఆకర్షణకి, నా బలహీనతకి. సుధకి లేకపోయినా, నేను తప్పు చేశాను అని నాకు అనిపిస్తూ ఉండేది.

''మనం పెళ్ళి చేసుకుందామా? మనవాళ్ళు ఒప్పుకోవటం అసంభవమనుకో'' అన్నాను ఒకసారి.

''పెళ్ళి కాకపోతే ఏం? నేను ఇట్లాగే ఉండిపోతాను. నాకు పెళ్ళి వద్దు.'' అంది.

ఈ నిర్ణయాలు గడ్డి పోచ మీద నీటి బిందువుల వంటివి. మనసులో ఉన్నంత వరకే అందంగా మెరుస్తుంటాయి. ఆచరణలో పెట్టవలసిన సమయం ఆసన్నమయ్యే సరికి చిరుగాలికే రాలిపోతాయి.

సుధకి సంబంధాలు చూస్తున్నారని తెలిసింది. నన్ను తప్పించుకుని తిరగటం మొదలుపెట్టింది. తన బలహీనత తెలిసివచ్చిందేమో!

ఒక రోజు ఒంటరిగా చూసి,

''ఏం చేద్దాం'' అని అడిగాను.

మాట్లాడలేదు.

''పోనీ ఎక్కడికైనా వెళ్ళిపోదామా?'' అన్నాను.

సుధ మొహం పాలిపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి!

''నేను రాలేను. రాను. రాజా, నన్ను మరచిపో.'' అంది.

తరవాత నేను మెడ్రాస్ వెళ్ళిపోయాను. తిరిగి సెలవల్లో వచ్చేటప్పటికి సుధ నాన్నగారికి ఆ ఊరునుంచి ట్రాన్స్ఫర్ అయిందని తెలిసింది. ఉత్తరాలు రాసినా సుధ దగ్గర నుంచి జవాబులు రాలేదు. తరవాత సుధకి పెళ్ళి అయిందని కూడా విన్నాను. ఏదో తెలియని వయసులో జరిగిపోయింది. మరిచిపోవాలనే నా ప్రయత్నం. అయినా తనని పొందలేకపోయినా, కనీసం ఆమెను గుర్తు తెచ్చే లాగ నా భార్య ఉండాలనే కోరిక నాలో అజ్ఞాతంగా ఉండి కాబోలు ఎంతమందిని చూసినా నా కంగీకారం కావటం లేదు. ఏం చెయ్యమంటావ్ చెప్పు..'' అన్నాడు— చిన్న నవ్వు నవ్వుతూ.

## 5

''ఏం చెయ్యమంటావ్ చెప్పూ'' అని రాజా నన్నే ప్రశ్నించాడు.

ఎన్నడూ లేనంత నిశితమయ్యాయి నా చెవులు. రాజా కంఠం ఆగిపోగానే నా చెవులలో నిండిపోయింది ఒకటే మాట.

సుధ! సుధ! సుధ! సుధ.

ఎవరీ సుధ! లోకంలో సుధలు ఎంతమంది లేరు? ఆ సుధే ఈ సుధ కావాలా? నా మనసు ఊరికే తొందరపడుతోంది. కానీ, సుధా వాళ్ళు ఆ ఊళ్లో, రాజా సొంత ఊళ్లో ఇదివరకు ఉండేవారు. ఈ సంగతి తెలుసుకోవటం ఎట్లాగా? సుధ పెళ్ళి కాకముందు ప్రేమించిందా?

అసంభవం! లోకంలో అటువంటివి ఎక్కడో జరగవచ్చు. కానీ నా భార్య నన్ను కాక ఇంకొకరిని ప్రేమించిందా?

చాకు లాగా కోస్తున్న ఆ ప్రశ్న నాలో తేరుకోలేని నీరసాన్ని కలిగిస్తోంది. వెంటనే తేల్చుకోవాలి. లేచి నుంచున్నాను.

''పద రాజా, మా ఇంటికి వెడదాం.''

''ఇంకొక రోజు వస్తాలే. ఇవేళ ఆలస్యం అవలేదూ'' అన్నాడు.

''అవలేదు. పద. మా ఇంట్లో కాఫీ త్రాగుదాం'' అన్నాను.

ఇల్లు చేరుకునేటప్పటికి హాలులో ట్యూబ్ లైటు వెలుగుతోంది. రేడియోలో నుంచి సన్నగా ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ వస్తోంది. సుధ లోపల ఉంది. మే మిద్దరం సోఫాల్లో కూర్చున్నాం. నా రాక గమనించి సుధ వస్తోంది.

''సుధా, ఇటు రా. ఇతడు నా స్నేహితుడు—''

సుధ కర్టెన్ తొలగించి ఒక అడుగు ముందుకు వేసింది. ఆమె ముఖంలోకే చూస్తూ అన్నాను నేను.

''రాజా. ఎసిస్టెంట్ ఇంజనీర్‌గా ఈ ఊరికి వచ్చాడు. ఇవేళే క్లబ్‌లో కలుసుకున్నాం. మేము చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం.''

సుధ కదలకుండా నిలబడిపోయింది. నేను ఇద్దరినీ గమనిస్తున్నాను. రాజా పెదవులు కదులుతున్నాయి. నిశ్శబ్దంగా ఏమి ఉచ్చరిస్తున్నాయో!!

నాకు తెలిసింది.

''సుధ!'' అంటున్నాయి.

నాకు తెలిసిపోయింది.

ఆ సుధ, ఆ రాజా ఇప్పుడు ఇక్కడ కలుసుకున్నారు.

ఎందుకు వాళ్ళని కష్టపెట్టటం! అనవసరం.

''కూర్చో సుధా. పోనీ కాఫీ తీసుకురా.'' అన్నాను. సుధ లోపలికి వెళ్ళటానికి అవకాశం ఇస్తూ. వద్దనుకున్నా ఎన్నడూ లేని కటుత్వం నా కంఠంలో ప్రవేశించింది.

మాటలు లేకుండానే, తెలియకుండానే కాఫీ త్రాగటం పూర్తయింది.

రాజా వెళ్ళటానికి లేచాడు. గేటు దాకా వెళ్ళాను.

''నా భార్య పేరు కూడా సుధ'' అన్నాను, నవ్వుతూ.

నా నవ్వు నాకే వికృతం అనిపించింది. ఏదో ప్రతీకారం వాంఛించటం మొదలుపెట్టింది మనసు.

## 6

''ప్రేమించింది!''

''ఎవరినో ప్రేమించింది!''

''పెళ్ళికి ముందరే ఇంకొకరిని ప్రేమించింది!''

సూర్యుడు అస్తమిస్తున్నాడు. కాలవ గట్టున కూర్చున్నాను నేను.

నా ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ నేను ఒంటరిగా ఉన్నానని కూడా మరిచిపోతున్నాను నేను.

పెళ్ళికి ముందరే ఇంకొకరిని ప్రేమించింది. అయితే ఏం, కొంప మునిగిందా

అని అడగవచ్చు. ఇంకెవరినైనా ఓదార్చటానికి నేనూ అంటాను.

లోకంలో ఆ విధంగా జరుగుతూనే ఉంటుంది. మానవ బలహీనత! సంకుచితత్వాన్ని వదిలి దాన్ని అర్థం చేసుకోవాలి అని నేనూ అంటాను.

కానీ అది నా భార్యే అయినప్పుడు నా మనసు సమాధానపడటంలేదు.

అట్లాగ ప్రేమించే హక్కు సుధకి లేదని నా మనసులో ఒక కంఠం కఠినంగా శాసిస్తోంది.

భారతీయ వివాహ వ్యవస్థ అత్యుత్తమమైన దని నమ్మినవాడిని నేను. వివాహం అనేది జీవిత సౌలభ్యం కోసం, అవసరాలు తీరటానికి ఏర్పడిన ముసుగుగా నేను ఎప్పుడూ ఊహించలేదు.

వివాహం జీవితాన్ని వ్యక్తిత్వాన్నీ కూడా పునీతం చేస్తుంది. దేవత్వపు టంచులకి నడిపిస్తుంది మానవుణ్ణి. దేహాన్ని ఆశ్రయించుకుని ఉన్న హృదయం ఆత్మ పరిణతి చెందటానికి తగిన సాధనం వివాహం.

నిరీక్షించటం!— సమాగమం చెందటం— కలిసి పయనించటం

అనంత వియోగం పొందటం— తిరిగి కలయికకు తపస్సు చేయటం.

ఈ జీవిత కావ్యంతో ఏ సుఖాలు సాటి రాగలవు!

తెలియదు కాబోలు.

ఇంతటి రసవిహీనమని ఊహించలేకపోయాను.

ఇంకొకరిని ప్రేమించిన యువతి— నన్ను ఎందుకు పెళ్ళి చేసుకోవాలి!

ఆ అర్హత ఆమెకి లేదు. నన్ను బాధించగల హక్కు ఆమెకి లేదు.

అతడినే ఎందుకు పెళ్ళి చేసుకోలేదు!

మనసు తనువు అర్పించటానికి గల స్వతంత్రం సాహసం పెళ్ళికి లేకపోయాయా? అవును. ప్రేమ ఇద్దరికి సంబంధించినది. దానికి ఇద్దరి అంగీకారం చాలు. పెళ్ళి సంఘానికి సంబంధించినది, కుటుంబానికి సంబంధించినది. అందరి అంగీకారం, ఆమోదం కావాలి. ఔను అమె సంఘానికి వెరచి కులాంతర వివాహం చేసుకోలేక ఈ వివాహానికి అంగీకరించింది. నా భార్య అయింది. కాదు. ఈమె నాకేమీ కాదు.

నాకు భార్య లేదు.

పెళ్ళి వరకూ మనసూ తనువూ నిలుపుకోలేని వారికి పెళ్ళి ఎందుకు?

ఈ వివాహ వ్యవస్థలో నమ్మకం లేని వాళ్ళు పెళ్ళి ఎందుకు చేసుకోవటం!

ఆచరణయోగ్యం కానిదా ఈ సంప్రదాయం! ఆచరణయోగ్యం కాని ధర్మాలు నిలబడలేవే. అందుకే బాల్యవివాహాలు చెప్పారా మన పూర్వులు. హిందూ వివాహ వ్యవస్థ ఇంత అస్థిరంగా సాగివస్తోందా?

నేను నమ్మను.

ఒక అల్పురాలు కారణంగా నేను ఈ వ్యవస్థ లోని ఉదాత్తతని శంకించను. అందుకు నా మనసే సాక్షి.

ఆమె వ్యతిరేకురాలు అవటం, నాలాగ పెళ్ళి విషయంలో పవిత్ర భావం నిలుపుకోలేకపోవటం నా దురదృష్టం. పెళ్ళికి ముందర ఇంకొకరిని ప్రేమించి తిరిగి హిందూ ధర్మానుసారం అగ్నిసాక్షిగా పెళ్ళికి సిద్ధమవటం ఎంత హాస్యాస్పదం! ఆత్మ వంచన! ప్రేమించటం తప్పని ఎవరూ అనరు. ప్రేమించి పెళ్ళి చేసుకోకపోవటం, ఇంకొకరిని పెళ్ళి చేసుకోవటం తప్పు. సమర్థనీయం కాదు ఏ దృష్టితో చూసినా.

నేను పెళ్ళి చేసుకున్నాను. ఈ వివాహ వ్యవస్థని నమ్మాను. త్రికరణ శుద్ధిగా వివాహం కాబోయే వధువు కోసమే నాలోని సర్వాన్ని నిరీక్షణలో ఉంచాను. అన్యధా చరించాలనే కోరిక ఏ నాడూ కలుగలేదు నాలో.

నేను కోరిన ఆమెని నేను పెళ్ళి చేసుకోవాలి. నా సర్వస్వం ఆమె కావాలి. ఆమెకి నేను కావాలి. ఈ విధంగానే ఆ వధువు ఉండాలని నేను కోరుకోవటంలో ఆశ్చర్యం ఏముంది!

## 7

వారం రోజులు సెలవు పెట్టాను కాలేజీకి. ఎవరికీ తెలియదు. నేను లేని వేళలో రాజు వస్తాడేమోనని. వాళ్ళిద్దరూ తిరిగి కలుసుకోవటం నాకు తెలియాలి. తెలిస్తే ఏం చేస్తాను! సుధని చంపుతాను. రాజుని కూడా. మరి నేను! నేను కూడా. లేదా సన్యాసులలో కలిసిపోతాను. సుధ నా భార్య. పెళ్ళి కాకముందరే తనను ఇంకొకరికి అర్పించుకున్నదా! నేను ఊహించలేను. ఇట్లా జరిగిందా? జరగకూడదు. అదే కనుక నిజమైతే— సుధ ఇంక ఉండకూడదు. నేను కూడా ఉండకూడదు.

వారం గడిచిపోయింది. రాజు రాలేదు. ఏమాలోచిస్తున్నాడు!

ఆ ఆదివారం రాజు చెప్పిన గుర్తు ప్రకారం అతడి ఇంటికి వెళ్ళాను.

చిన్న ఇల్లు. అందంగా బాగుంది. వంట, పని చేసే నౌకరున్నాడు.

''ఈ వారం సెలవు పెట్టాను. రేపు జాయిన్ అవుతున్నా''నని చెప్పాను. కాఫీ త్రాగి, కబుర్లాడి వచ్చేశాను. ఇంకొక వారం రోజులు సెలవు పొడిగించాను.

ఇక తప్పదు రేపు వస్తాడు.

నేను ఉండని వేళలో.

స్నేహితుడి భార్యగా తన ప్రేయసిని ఇక్కడ చూడటం—

మాట్లాడకుండా, మనసు తెలుపుకోకుండా ఉండగలడా రాజు!

అసంభవం.

మా రోడ్ చివర దుకాణం ఉంది. కాచుకుని చూశాను. పొద్దున్న రాలేదు. మధ్యాహ్నం భోజనం చేసి మళ్ళీ అక్కడికి చేరాను. ఏమిటీ కాపలా! ఎందుకీ హీనస్థితి. కాలేజీకి వెళ్ళిపోతే!

రెండవ చివర నుంచి రిక్షాలో ప్రవేశించి దూరంగానే దిగి, నడిచి ఇంట్లోకి వెళ్ళాడు రాజు.

నాగుండె ఆగిపోయింది.

కానీ నేను నడిచి ఇల్లు చేరుకున్నాను. హాలులో ఎవరూ లేరు. బెడ్ రూమ్‌లోంచి మాటలు వినిపిస్తున్నాయి.

''నిన్ను మరిచిపోలేక పోయాను సుధా.....''

సుధ అతడి చేతుల్లోంచి విడిపించుకుంటోంది.

''మీరు వెళ్ళిపొండి— వెళ్ళిపొండి. జరిగింది జరిగిపోయింది. ఇంకెప్పుడూ రావద్దు— రావద్దు— నాకు పెళ్ళయిపోయింది. నేను ఆ సుధని కాదు.''

ఎన్నాళ్ళ బాధ!

సుధ గతాన్ని తలచుకుని పశ్చాత్తాప పడుతోందా? ఇప్పటి స్థితికి బాధ పడుతోందా?

''నాతో మాట్లాడవా?''

''ఏముంది మాట్లాడటానికి? అసలు నువ్వెందుకు వచ్చావ్? అతడు లేకుండా! నేను బ్రతకాలని లేదా?''

నిన్ను మరచిపోలేకపోయాను సుధా! రాకుండా ఎట్లా ఉండగల ననుకున్నావ్? ఒక్క సారి మాట్లాడు చాలు.......''

## 8

నిశ్శబ్దంలో సుధ కన్నీటి చప్పుడు వినిపించింది. నేను వచ్చేశాను.

నడచి నడచి కాలవ గట్టుకు చేరాను. అక్కడ బెస్తల పిల్లలు వలలు వేసి చేపలు పడుతున్నారు. సూర్యుడి కిరణాలు పడి ప్రవహించే నీరు తళతళా మెరిసి పోతోంది. ఇదంతా సృష్టి. ఎవరికీ కనిపించని అర్థంకాని వాడి సృష్టి. నేనూ ఈ సృష్టిలో ఒక ప్రాణిని.

ఇట్లా జరుగుతుందా! జరగకూడదు. కాని జరిగింది. కానీ నేను నమ్మలేను. నా కనుల యెదుట జరిగినదానినే నమ్మలేకుండా ఉన్నాను. నాకు మతి భ్రమించిఉండమ్ము. కాదు కాదు. ఏవిషయం గురించైనా అంతటి గాఢమైన అభిప్రాయం, నమ్మకం ఉంచుకోవటం తప్పు.

అది బాధకి దారి తీస్తుంది.

అందుకే అది తప్పు.

ఈ ప్రపంచంలో ఎన్ని రకాల వ్యక్తులు! అందరూ మనలాగే ఉండాలని అనుకోవటం, ఉంటారని అనుకోవటం హాస్యాస్పదం. అజ్ఞానం. బాధాకరం. సరే.

ఇది నా ఆశలకీ ఆశయాలకీ గొడ్డలి పెట్టు. పవిత్రతకి నేను అంత విలువ ఇచ్చాను. దానికి నా జీవితంలోనే అర్థం లేకుండా పోయింది.

నేను వివాహం చేసుకున్న యువతి నన్ను ప్రేమించటంలేదు.

ఇంకొకడికి తనను అర్పించుకుంది.

ఇది నా జీవితాన్నే అపహసిస్తోంది.

ఏం ప్రపంచం! నీవు నిలుపుకున్న విలువలు ప్రపంచంలో లోపించి నీవు అందుకోలేకపోతే ఈ ప్రపంచమే అర్థవిహీనమైపోతుంది. నీ ప్రపంచం పునాదులతో సహా కూలిపోతుంది. నీవు ఇంత ప్రపంచంలోనూ ఒంటరివాడ వవుతావు. శోకమొక్కటే నీకు తోడవుతుంది.

ఇప్పుడు నా పరిస్థితి అదే.

అతిగా నా భార్యను గురించి ఊహించుకున్నందుకు, ఆమె పవిత్రత మీద అంత నమ్మకం ఉంచుకున్నందుకు, నన్నే సర్వస్వంగా భావిస్తుందని మురిసిపడినందుకు ఈ బాధ నేను అనుభవించక తప్పదు.

కానీ!

ఇట్లా ఎందుకు జరగాలి! ప్రేమించటం తప్పు కాదు.

కానీ!

ప్రేమించిన వాడిని ఎందుకు పెళ్ళి చేసుకోలేదు! — నన్ను, వివాహంలో పవిత్రతని నమ్మినవాడిని

భార్య తొలివలపు నాదే కావాలని

శాశ్వతంగా మేము ప్రేయసీ ప్రియులం కావాలని

కావ్యగానం జీవితంలో ఆలపించుకునే నన్ను

ఎందుకు పెళ్ళి చేసుకోవాలి?

విధా?

మన చేతకాని తనానికి, బలహీనతకి విధి అని పేరు పెట్టటం అన్యాయం. తన విధిని తెలుసుకోలేని బలహీనురాలు సుధ. మానవ స్వభావం, బలహీనతల్ని అర్థంచేసుకోలేని మూఢ నమ్మకాలతో, నిశ్చయాలతో — బలహీనుడిని నేను. బలహీనులు బాధపడక తప్పదు.

బలహీనత!

ఆమె బలహీనత కారణంగా నా జీవితం అర్థహీనమయింది.

మధువు నింపుతుందనుకున్న పాత్ర ఉప్పు నీటితో నిండింది.

నా కన్నీటితోనే నిండుతోంది.

బలహీనులైతే శిక్ష పొందవలసిందే.

ఇక సుధని నే నెట్లాగ ప్రేమించ గలను! లేదు. ఆమెను నేను ప్రేమించ లేను. ఒక నాడు జీవితాశయ మనుకున్నది నేడు హాస్యాస్పదంగా మారింది — నా ప్రేమ.

ఎప్పుడో ఈ సత్యం బయట పడుతుంది.

నా కన్నుల యెదుటే ఈ అపరాధం బయట పెట్టాలి.

అప్పుడు సుధ ఏమనగలదు. తల వంచుకుంటుంది సిగ్గుతో. కన్నీటితో కాళ్ళమీద పడి ప్రార్థిస్తుంది.

నేను ఏమీ అనను. ఏమనటానికీ నాకు అర్హత లేదు.

అర్హత ఉన్నవాడు భోగనంతుడు ఒక్కడే.

కానీ నేను క్షమించలేను. ఆరని మంట నా యెదదలో రగులుతుండగా నేను సుధను క్షమించలేను. ఆమెని నా భార్యగా చూసుకోలేను.

ఆ నాడు —

ఆమె తప్పిదం దానంతట అది బయట పడిన నాడు, ఆమె సిగ్గుతో తల వంచుకుని ఆ కన్నీటితో క్షమార్పణ వేడినప్పుడు —

బహుశః అదే ఆమెకు తగిన శిక్ష —

నేను మౌనంగా బయటకు నడుస్తాను.

ఆ ఇంటి బయటకు నడుస్తాను.

ఆ ఇంటితో, ఆ వ్యక్తితో సంబంధం లేని బయటి ప్రపంచంలోకి నడుస్తాను.

శాంతి లేని అశాంతిలోకి నడుస్తాను.

''నువ్వు వచ్చినప్పుడంతా నా మనస్సులో తుపాను రేగుతుంది. వద్దు రాజా— నువ్వు రావద్దు. నన్ను చూడటానికైనా రావద్దు. నాలో సంఘర్షణ నీకు తెలియదు. నువ్వు ఊహించలేవు. వెళ్ళిపో— ఈ ఊరు విడిచి వెళ్ళిపో....''

సుధ మాటలు కరుకుగా, నిరసనగా ఉన్నాయి కానీ— ఆ మాటలు సుధ అతడి భుజం మీద తల ఆన్చి చెబుతోంది.

**9**

''వెళ్ళిపోతాను సుధా— ఈ లోపుగా ఇంకొక నాలుగు సార్లు నిన్ను చూడనీ. అంతకంటే ఎక్కువ అడిగే స్థితిలో లేను నేను. ఇచ్చే స్థితిలో లేవు నువ్వు.''

సుధ నవ్వింది.

''మరి ఈ రావటం— ఈ ఆవేదనని రేపటం ఎందుకు చెప్పు?

ఈ వూళ్లో ఉండి నిన్ను చూడకుండా వుండలేను సుధా. నీకు నేను తెలుసని అతడికి చెప్తే ఏం?''

సుధ అతడిని విడిచి దూరంగా వెళ్ళింది.

''వద్దు. నీకు తెలియదు అతడి సంగతి. అతను సహించలేడు. సహించలేడు.''

''అది కాదు కేవలం స్నేహితుడుగా తెలిస్తే ఏం?''

''నేను అబద్ధం ఆడలేను రాజా.''

నేను వచ్చేశాను.

''అతడు సహించలేడు— సహించలేడు.''

**10**

నేను వచ్చేశాను.

నేను సహించలేను.

కాలేజీ పుస్తకాలు బల్లమీద పడేశాను. కోటు విప్పి పారేశాను. బూట్స్ వదిలి

చెప్పులు తొడుక్కున్నాను. రాకెట్ తీసుకున్నాను. వచ్చేశాను. నేను వచ్చినట్లు, వాళ్ళని చూసినట్లు చెప్పటానికి చాలిన సాక్ష్యం వదిలి వచ్చేశాను.

సుధకి నేను వచ్చానని తెలుస్తుంది.

నేను వచ్చేశాను.

పిల్లలు వలలు వేసి కాలువలో చేపలు పడుతున్నారు. సూర్యుడి ఎండకి నీరు తళతళా మెరుస్తోంది.

ప్రేమ!

నా హృదయాన్ని, నన్ను నిలువునా ఆమోదించి నన్ను ఆనందంలో ముంచెత్తిన ప్రేమ ఏమయిపోయింది! సుధ రాజును ప్రేమించిందని తెలియగానే ఏమయిపోయింది? అంతా భ్రమ. ఈ ద్వేషం అసహ్యం నాలో ఎక్కడ నించి వచ్చాయి! అసలు వాటి ఉనికిని, నీడని కూడా ఎప్పుడూ చూడలేదే. ఏ మూల అణిగి ఉన్నాయి? నాకు తెలియకుండానే ఇప్పుడు కొంచెం సందు గుండా ప్రవేశించి గది అంతా ఆక్రమించే పొగ లాగ నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రేమ కూడా ఏ మూలనో అణిగి ఉందా? మాయమైందా? సుధని మాత్రం నేను తిరిగి ప్రేమించ గలగటం అసంభవం. సుధని నేను చంపలేను. నేను క్షమించలేను కూడా. సుధ ఏడుస్తుంది. క్షమించమంటుంది. ఏమిటి చెయ్యటం! పెళ్ళి చేసుకున్నంత మాత్రాన భార్య కాదు నా దృష్టిలో మనసిచ్చినవాడికే భార్య.

కానీ—

''రాజా, సుధ నీ భార్య. నువ్వు తీసుకో'' అంటే—

ఎంత హాస్యాస్పదం— ప్రపంచం దృష్టిలో

అది సుధ నిర్ణయించుకోవాలి. నేనే వెళ్ళిపోతాను. ఎక్కడికో— శాంతి లేని అశాంతిలోకి.

నేను ఇంటికి వెళ్ళేటప్పటికి సుధ ఏం చేస్తుంటుంది!

ఏడుస్తూ ఉంటుంది. కన్నీళ్ళతో నన్ను ప్రార్థిస్తుంది. క్షమించ మంటుంది. ఏడుస్తున్న సుధని నేను తిరస్కరించగలనా?

ఏమైనా నా నిశ్చయం మారకూడదు. నేను సుధని క్షమించకూడదు.

అందమైన కళ్ళలో నీళ్ళకి నా మమకారానికి పాత్రమయిన వ్యక్తి యొక్క పశ్చాత్తాపానికి, నా నిశ్చయం సడలి నేను ఆమెని క్షమించితే— ఆ క్షణికోద్రేకంలో క్షమిస్తే— ఆమెని ఊరడిస్తే—

నన్ను నేను క్షమించుకోలేను. ఆమె కాదు అపవిత్రురాలు, నేను. బలహీనుడిని నేను! బలహీనతని నే నేనాడూ హర్షించలేదు.

హర్షించలేను!

## 11

నేను ఇల్లు చేరి లోపల నేను ప్రవేశించినప్పుడు సుధ నాకు కనిపించలేదు.

డ్రస్సింగ్ టేబుల్ మీద కనిపించింది సుధ వ్రాసిన లేఖ.

''మీకు తెలిసింది. ఏ నాడో ఒక నాడు మీకు తెలుస్తుంది. అది నాకు తెలుసు. తెలిసిపోయింద్తి—

తెలుస్తుంది అని ఇన్నాళ్ళూ బాధతో గడిపాను!

బాధ ఎందుకని ప్రశ్నించవచ్చు.

తప్పు చేశానని. తప్పని తెలిసి ఎందుకు చెయ్యటం? అని మీరు తీవ్రంగా ప్రశ్నిస్తారు.

ఒక నాటి మనఃస్థితిలో తప్పుగా కాక, జీవితానికే అర్థంగా ఊహించుకున్న అజ్ఞానం, అమాయకత్వం, అపరిపక్వతతో ఏకమైన పరిస్థితి అది.

అది దురదృష్టవంతులకు, బలహీనులకు కాలం గడవటంలో అనుకూలంగా కాక ప్రతికూలమౌతుంది.

అప్పుడు జరిగినది తప్పని తెలుస్తుంది.

కొంతమందికి ముందర త్రోవ కూడా మూసుకుపోతుంది.

ఇన్నాళ్ళూ బాధతో గడిపాను. సమస్యతో వేగిపోయింది నా మనస్సు. దీనికి కారణం నా బలహీనతే కావచ్చు. దృఢమైన అభిప్రాయానికి రాలేకపోవటం నా బలహీనతే. ఆ కారణంగా ఇద్దరి మధ్య నిలబడటం నన్ను దహించింది.

ఇన్నాళ్ళు సాహచర్యంలో మీ భావాలను, మిమ్మల్ని నేనూ కొంత గ్రహించగలిగాను. ఆ తీవ్రతకి నేను తట్టుకోలేను. మీకు అంత కంటె దగ్గర

కాలేకపోయాను—

కానీ

మీకు నా పరిస్థితి తెలిసిన నాడు ఒక మలుపు వస్తుందనుకున్నాను.

మలుపు వచ్చింది.

కానీ

నేను అనుకున్న విధంగా కాదు.

మీరు వచ్చారు.

చూశారు.

మీకు తెలిసింది.

ఇదివరకే తెలుసునేమో కూడా.

ఔను, మీకు ఇంతకు ముందరే తెలుసు.

కానీ—

మీకు నా మీద కోపం రాలేదు. నన్నేమీ అడగలేదు. అంత నిశ్చలంగా ప్రవర్తించటం ఎల్లాగ సాధ్యం! నా కర్థమైంది. నేను మీకు ఏమీ కాలేకపోయాను. మీ భార్యని కాలేకపోయాను.

భర్త— భార్య తప్పు చేస్తుంటే చూసి, తెలిసి ఊర్కోగలడా! అడిగే హక్కు, ఆ మార్గం నుంచి మళ్ళించే హక్కు అతడికి ఉంది.

అది అతడి విధి!

మీకు తెలిసి ఊరుకున్నారు. మీ ప్రేమ— మీ ఆశయం— వాటి లోతులు ఏమిటి?

మీకు నా మీద ఏం మిగిలిందో కూడా నాకు తెలియదు. అసలు మిగల వలసింది ఏమీ లేదు. మిగలనందుకే నేను సంతోషించాలి. కారణం నేనే. నాకు ఈ ఇంట్లో స్థానం లేదు. ఎప్పటికైనా గతాన్ని కడుగుకో గలిగితే— భర్తగా మిమ్మల్ని నిలుపుకో గలిగితే— నేను వస్తాను, మీ దగ్గరికే.

—సుధ.

## 12

ఏమైంది! ఏమి జరిగింది! సుధ ఇల్లు వదిలి నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయింది. తనే వెళ్ళిపోయింది. నేను మాత్రం ఇక్కడే ఉన్నాను. మనిషిని విధి పరిహసించటం అంటే ఇదేనా!

చూసి చూడనట్లు, తెలిసి కోపపడనట్లు క్షమాశీలిగా, శాంతస్వభావుడిగా ఉంటే సుధ నా ఔదార్యానికి కరిగి, తన తప్పుకు పశ్చాత్తాపపడి, నా కాళ్ళ మీద పడి కన్నీటితో ప్రార్థిస్తుందనుకున్నాను. క్షమను అర్థిస్తుందనుకున్నాను.

క్షమించకూడదని, క్షమిస్తానేమోనని భయపడ్డాను.

కానీ

సుధ— తెలిసి నేను సహించటం, ఆమె తప్పును క్షమించటం తను సహించలేకపోయింది.

ఆమె నాకు భార్య కాలేకపోయింది.

నేను ఆమెకు భర్తను కాలేకపోయాను.

ఇంతమంది— సముద్ర తీరంలో ఇసుక రేణువుల్లా

అనంతాకాశంలో లెక్కకు మించిన చుక్కల్లా

తారసపడే ఈ లోకంలో, ఈ ఇద్దరికీ ముడి వేసే ఒక చిత్రమైన జంటను చేశాడు విధాత!

క్షమించలేనివారికి శాంతి లేదు ఈ లోకంలో.

స్థిరత్వానికి చోటు లేదు ఈ లోకంలో.

నాకు శాంతి లేదు.

నా నమ్మకాలకు చోటు లేదు.

## 13

సుధ ఒక శాంతి ఆశ్రమంలో చేరినట్లు తెలిసింది. రాజా ఆ వూరునుంచి వెళ్ళిపోయాడు. సుధ వెళ్ళిపోయిన సంగతి అతడికి తెలుసునో తెలియదో కూడా నాకు తెలియదు.

సుధ వెళ్ళిపోయింది. ఆమెకు నాహృదయంలో స్థానం లేకపోవచ్చు. కానీ ఆమె బాధ్యత నాది. ఆమె మెడలో తాళి కట్టిన భర్తని నేను. మనిషి రెండుగా బ్రతుకుతున్నాడు ఈ ప్రపంచంలో. సంఘంలో మనిషి— తనలో మనిషి. తనలో మనిషే సంఘంలో మనిషిగా ఏ నాడైనా ఈ భూమి మీద మనగలుగుతాడా మానవుడు!

పెళ్ళి చేసుకున్న నాడే సుధ బాధ్యత నాది అయింది.

సుధ వెళ్ళిన పదిహేను రోజులకు సుధ అన్న వచ్చాడు.

''సుధ శాంతి ఆశ్రమంలో చేరింది. కారణం చెప్పండి బావగారూ! మేము ఎంత అడిగినా చెప్పలేదు. తెలుసుకోవలసిన బాధ్యత మాకు కూడా ఉంది కదా'' అన్నాడు.

''రెండేళ్ళు అయినా మాకు పిల్లలు లేరని సుధకి అశాంతిగా ఉంది ప్రసాద్'' అన్నాను శూన్యమైన నవ్వుతో.

''నిజమా! కావచ్చు. సుధ ఆశ్రమంలో చిన్న పిల్లల సంరక్షణ చూస్తోంది.

''కానీ రెండేళ్ళకే అంత నిరాశా. నిరీక్షించనక్కరలేదా'' అన్నాడు.

ఒక్కొక్క వేళలో వూరికే అన్న మాటలు అట్లా అతికిపోతాయి.

నిరీక్షణ ఎట్లా ఉన్నా, ఇదమిత్థమని తేలకనో, ఇటా ఆటా నిర్ణయం చేసుకోలేక కొంతమంది జీవితాలు కూడా ముగిసిపోతాయి.

నా జీవితంలో శాంతి లేదు. బాధ్యత లేదు.

సుధను ఒక సారి చూసి వద్దామనే నిర్ణయానికి రావటానికి ఏడాది పట్టింది.

## 14

ఆశ్రమానికి వెళ్ళాను. సుధ మారలేదు. ఆమె అందం తరగలేదు.

దూరాలకి చూసే చూపులు, ఏదో వెతుక్కునే కళ్ళు—

ఆశ్రమ ప్రశాంతతలో అందపు చాయలు సుధని అలముకునే ఉన్నాయి. నన్ను చూసి సుధ కళ్ళు వాల్చుకోలేదు. మొహం తిప్పుకోలేదు.

''నిన్ను చూద్దామని వచ్చాను'' అంటే –

''బాగానే ఉన్నాను'' అంది.

''కానీ నీ బాధ్యత నాది. అక్కడికి రా. ఇంటికి రా, సుధా. అక్కడే ఉందువుగాని. నిన్ను నేను బాధించను. నీకు స్వతంత్రం ఉంటుంది.''

''కానీ ఇక్కడ అనాధ లాగ ఉండటానికి నేను ఒప్పుకోలేను.''

''నేను ఉన్నాను కదా. నీ బాధ్యత నాది.''

సుధ నవ్వింది.

''వస్తాను. ఇప్పుడు కాదు. ఇంకా కొన్నాళ్ళు ఇక్కడే ఉంటాను.'' అంది.

## 15

నా ప్రేమ, నా ద్వేషం, ప్రతీకారం ఏమై పోయాయి? ఇప్పుడు బాధ్యత ఒకటే మిగిలింది. సుధ నా బాధ్యత. అందుకే రమ్మని కోరాను. సుధ నిరాకరించింది.

అయినా జీవితాంతం ఆమె బాధ్యత నాది. ఆమెని రమ్మని అడుగుతూనే ఉన్నాను. సుధ అంగీకరించి వచ్చేటప్పటికి నాలుగేళ్ళు గడిచాయి.

సుధ రూపంలో మారలేదు. ఆమె మనస్సులోని మధనం, ఆలోచనలలో నిగ్రహం ఆమె మూర్తికి ఒక విశిష్టత నాపాదించాయి.

నిర్మలంగా, నిరాడంబరంగా ఉండే సుధలో యోగిని వర్చస్సు ఉంది.

పాతికేళ్ళకే సుధ ప్రేమకీ, సుఖాలకూ విరక్తురాలయింది.

వయస్సులో అనుభవాలు పొందకుండానే ఆలోచనలతో విరక్తి పొందిన ఆమె

ఆత్మ ఏ తపన చెందుతోందో! ఈ ఘర్షణాత్మకమైన ఆమె స్థితికి కారణం నేనా? నావలన సుధ జీవిత సౌఖ్యం, మాధుర్యం కోల్పోయిందా? నేను క్షమించి ఉంటే సుధ సుఖపడేదా?

సుఖాపేక్ష ఉన్న వ్యక్తి ఆశ్రమంలోనూ నిరాడంబరంగా ఉండలేదు. సుధ సామాన్యాతీత వ్యక్తి. ఆ వ్యక్తిని నాదిగా నేను పొందలేకపోవటం, నా దురదృష్టం. శాపం. మనిషి వస్తువు కాదు. నీవు కోరినంత మాత్రాన నీది కాదు. ఆమె కూడా నిన్ను కోరినప్పుడే నీది అవుతుంది.

సుధ మీద లాలసతో ఈ విధంగా ఆలోచిస్తున్నానా?

సుధ మీద వ్యామోహం సుధలో దోషాన్ని కప్పిపుచ్చుతోందా?

ఏది నిజం! నిజం ఏదైనా, కర్తవ్యం ఎంత కఠినమైనదైనా కర్తవ్యాన్నే నిర్వర్తించటానికి సిద్ధంగా ఉన్నాను.

కానీ,

ఏది కర్తవ్యం!

మాయ, మంచి తెలియని మూఢునినా నేను?

సుధ అంగీకరించింది. మంచిదే. సుధ బాధ్యతే నా కర్తవ్యం. ఇప్పటికైనా నా కర్తవ్యాన్ని నిర్ణయించుకోగలగటం సంతోషకరమే.

సుధ నా కనుల యెదుట తిరుగుతుంటే, నవ్వుతుంటే, నేనామెని తిరిగి వాంఛిస్తానా? అసంభవం. నా మనసులో వాంఛ లేదు. ప్రేమ లేదు. అంత అదృష్టానికి, అనురాగానికి నేను నోచుకోలేదు. నాకు తెలుసు— నేను సుధని వాంఛించి అక్రమంగా ప్రవర్తిస్తే— సుధ నా భార్య అయినా— నా పరితాపానికి, ఆవేదనకి అంతు ఉండదు. సుధని నేను కోరను. కోరలేను. సుధని చూడ వలసిన బాధ్యత నాది. సంఘంలో వ్యక్తిగా ఆమెని భరించవలసిన వాడిని నేను. సుధని జీవితాంతం నేను పోషిస్తాను. రక్షణ ఇస్తాను.

సుధ ఇంటికి వచ్చింది. కాని మా మధ్య అనుబంధం లేదు.

అసలు ఈ ప్రపంచం—

రాత్రి నుంచి పగలు లోకి, పగటి నుంచి రాత్రి లోకి,

చెడునుంచి మంచికి, మంచినుంచి చెడుకి,

నియమంలోంచి విశృంఖలత్వంలోకి, విశృంఖలత్వంలోంచి నియమంలోకి,

ప్రేమనుంచి ద్వేషానికి, ద్వేషంనుంచి ప్రేమకి,

రాగంనుంచి వైరాగ్యంలోకి, వైరాగ్యంనుండి రాగంలోకి,

జ్ఞానంలోనుంచి అజ్ఞానంలోకి, అజ్ఞానంలోనుండి జ్ఞానంలోకి,

అవిరామంగా ప్రవహించే నిరంతర స్రవంతి.

ఒక జీవితానికి, మనిషికి నిర్ణయించగల హద్దులు ఏవి? ఎక్కడ?

సుధని నా బాధ్యతా నిర్వహణ కోసం రమ్మన్నాను.

ఆ నాడు సుధని గురించి అంత కంటె ఆలోచన లేదు నాకు.

లోకంతో సంబంధం లేకుండా ఎట్లా జీవిస్తోంది సుధ!

ఆమెకు నా పరిచర్యలతో పరిపూర్ణానందం లభిస్తోందా?

ఆమె మనసు కోరికల నుంచి విముక్తి పొందిందా?

ఆమె హృదయం అంత పరిపక్వత చెందిందా?

పని లేని వేళ చల్లని గాలిలో ఆకాశంలోకి చూస్తూ కూర్చునే సుధ నాలో జాలి కలిగించింది. చాంచల్యం లేని ఆమె కనులలో వెలుగు నాలో వెరగు కొల్పింది. మౌనంలోనే రోజంతా గడిపి, ఏకాంతంగా దుఃఖం లేకుండా మసలే ఆమె యోగిని లాగ కనిపించింది. సుధ మామూలు స్త్రీ కాదు; యోగిని. ఆ యోగిని నన్ను తన అసమానమైన ఆకర్షణా సౌందర్యంతో తన వైపు లాక్కుంటోంది. ఔను, నాకు తెలిసింది. నేను ఆకృష్టుడ నయ్యాను. చలించింది నేను కాదు. నన్ను ఆవరించుకుని ఉన్న సర్వ ప్రకృతి చైతన్యం— అదే కాబోలు ఆత్మ.

## 16

ఎవరీ సుధ! ఎక్కడ నుంచి వచ్చింది!

ఆ రోజు నేను వరండాలో కూర్చున్నాను. సుధ పక్కనే ఉన్న గదిలో తన పక్క మీద కూర్చుని ఉంది. కిటికీలోనుంచి వెలుతురు ఆ గదిలోని చీకటిలోకి ప్రసరిస్తోంది. ఆ చీకటి వెలుగుల్లో సుధ ఉంది. ఆమె నల్లని కనులలో వెలుగు ఉంది. మళ్ళీ మళ్ళీ నాలో ఆ ప్రశ్న కలుగుతోంది—

ఎవరీ సుధ! ఎక్కడ నుంచి వచ్చింది!

వరండాలో పూర్తిగా వెన్నెల ఉంది. ఆ వెన్నెలలో కూర్చుని ఉన్నాను, నేను.

ఇన్నాళ్ళూ, ఇంతవరకూ నిర్వికార చిత్తుడిని నేను.

సుధ దృష్టిలో కూడా నిర్వికార చిత్తుడిని నేను.

నాలోని ఈ సంచలనాన్ని సుధ తెలుసుకో గలదా? ఊహించ గలదా?

నన్ను నిలువునా కదలిస్తున్న తన ఆకర్షణ సుధకు తెలుసా?

చీకటిలో కూర్చుని వెలుగు నింపుకుంటున్న ఆమె మూర్తి వెలుగులో కూర్చున్న నన్ను తన వైపు బలంగా లాక్కుంటోంది.

అది ఒక రాత్రి.

ఆ రాత్రి!

సర్వ గుణాలకూ అతీతమైన రాత్రి, చేతనా ప్రపంచాన్ని నిర్వికారమైన నిద్రతో తనలో లీనం చేసుకునే రాత్రి. జీవుడు— ప్రపంచాన్ని అధిగమించి తన తత్త్వంతో కొంత సేపటి కోసం కలిసిపోయే రాత్రి.

అ రాత్రిలో నన్ను బలంగా ఆకర్షిస్తోంది సుధ.

అన్నిటినీ త్యజించి సర్వ గుణాలకు అతీతంగా—

ఐక్యమై పోవాలనే గాఢమైన తమి ఇదివరకు ఎప్పుడూ, నాకు తెలియదు.

ఇది నా జీవితంలో అపూర్వమైన క్షణం.

లోకాతీతమైన ఆనందం నా కందుబాటులో నిలిచిందన్న తలంపు,

సమయం దాటిపోతే అవకాశం చేయి జారిపోతుందన్న తత్తర,

నేను శాంతిని పొందగల సంఘటన ఇదే నన్న భావనా,

నన్ను ఆవహించాయి.

ఈ రాత్రిలో ఇతర ప్రపంచం లేదు. మంచి—చెడు లేవు. పవిత్రత— అపవిత్రత లేవు. అన్నింటిని రాత్రి నిద్రతో ఆక్రమించింది.

మిగిలింది నేనూ—సుధా.

ఈ లోకమంతా నా మనసులో మాయం కాగా

మిగిలింది నేనూ—సుధా.

సుధని నేను క్షమించాను.

నేను సమీపించేటప్పటికి కూడా సుధ అల్లాగే కూర్చుని ఉంది. వెలుగు ఆమె మీద పడుతోంది. గదిలో అడుగు పెట్టిన నా వైపు చూసింది సుధ.

ఆమె కనులలో నిశ్చలమైన వెలుగు—

ఆ వెలుగులో కలిసిపోటానికి నా సర్వస్వం తపిస్తోంది. ఆమెకీ నాకూ మధ్య మౌనం తెర లాగున వుంది. తెరల చాటున సుధని సమీపించలేను నేను. మౌనం వదిలి, చివరికి—

'నేను నిన్ను చాలా క్షోభ పెట్టాను. భర్త ఉండి కూడా ఆశ్రమంలో గడిపావు'' అన్నాను.

సుధ నవ్వింది.

''దానికి నారణం మీరు కాదు. నేనే'' అంది.

''నన్ను నిందిస్తున్నావా?'' అన్నాను.

సుధ నిట్టూర్చింది.

''ఎందుకు? లేదు. సాంఘిక నిబంధనల్ని వ్యక్తి పాటించాలి. లేదా ఇతరులతో సంబంధం తెంచుకోవాలి. వ్యక్తిగత ఆశయాల్ని సంఘం ద్వారా సాధించటానికి పూనుకోకుండా తన జీవితంలోనే పొందాలని తొందరపడే హక్కు వ్యక్తికి లేదు. తెలియక చేసినా పెళ్ళి చేసుకుని మీ జీవితాన్ని అర్థవిహీనం చేశాను. కానీ ఇప్పుడు— నాకు కోరికలు లేవు. సమస్యలు లేవు. గతము లేదు. నాకు మిగిలింది మీరే. మీ సంతోషమే నాకు సంతోషం. మీ శాంతి— నాకు శాంతి.''

''కానీ నీకు నాలోని సంచలనం తెలియదు. విరక్తి, శాంతి నిండిన నువ్వు నన్ను నీవైపుకు లాక్కున్నావు. నీ చూపులలో వెలుగులు నన్ను బంధిస్తున్నాయి. నువ్వెతావా సుధా! నాలో అశాంతి నిండిపోయింది. నా శాంతి నీలోనే ఉంది. ఆ శాంతిని నేను పొందాలి. నీతో ఐక్యం అయిపోవాలనే కోరిక నాలో వివశంగా ఉంది. నా మనసు నన్ను పరిహసిస్తోంది.

సుధ నవ్వింది. తల వొంచి—

''నేను నవ్వను. మీరు కోరితే నేను మీదాన్ని, మీ భార్యను.'' అంది.

ఆమె భుజాల మీద వ్రాలిన నా చేతులు ఆమెను నాలో ఐక్యం చేశాయి. ఆ రాత్రి! తమకం తప్ప నేను ఇంకేమీ ఎరగను. ఈ మనసుకు, దేహాలకూ అతీతమైన ఆనందం ఒకటి అనుభవనీయమైంది నాకు. అది నేను ఇదివరకు అనుభవించి ఉండలేదు. ఆ అద్వైతంలో నా ఆత్మ నన్ను విడిచి ఏమైందో నాకు తెలియదు. నా జీవితంలో అంతటితో, ఆ రాత్రితో ముగిసి ఉంటే....

## 17

ఆ రాత్రితో నా జీవితం ముగియలేదు. నా జీవిత పరిభ్రమణం ఇంకా పూర్తి కాలేదు. ఆ తర్వాత— తెలతెలవారుతుంటే నా కనులు విచ్చుకున్నాయి. ముడివీడిన కురుల మధ్య ప్రశాంతంగా నిద్రపోతోంది సుధ. సుధ! నా జీవన సుధ— కాదు, సుధ నాది కాదు. సుధ ఎవరిదీ కాదు.

తనను తాను జయించిన వ్యక్తి.

నేను ఏం చేశాను? రాత్రి, ఆ మత్తు నిండిన వేళలో ఏం చేశాను? రాత్రి గడిచింది. పగలు వస్తోంది. నా కనులు తెరుస్తున్న పగలు నాపై నాకే అసహ్యాన్ని కలిగిస్తోంది.

రాత్రి ఏం చేశాను!

ఒక నాడు నిరసించి, అవమానించి పగ తీర్చుకో గోరిన స్త్రీనే కాంక్షించాను. స్వాధీనమయ్యాను. ఆమెని క్షమించాను. నన్ను నేను క్షమించుకోలేను. ఆమె బాధ్యత నాదే. ఆశ్రయమిచ్చాను.

కానీ—

ఆమె ఆకర్షణకు తట్టుకోలేకపోయాను. నిగ్రహించుకోలేకపోయాను. భార్య కాదనుకున్న స్త్రీని కోరాను. నన్ను నేను క్షమించుకోలేను. ఈ పగలులో రాత్రి జరిగినది నిజమేనా అనిపిస్తోంది. జరిగినది నా ఊహకు అతీతంగా కనిపిస్తోంది.

మానవుడు! తన కతీతమైన నిర్ణయాలు చేసుకుని ఎక్కడో స్వర్గానికి ప్రాకాలనుకుంటాడు.

కానీ—

దాని కతడు ఎంత దూరంలో ఉన్నాడో అతడి కెప్పుడూ తెలియదు.

ఈ నాడు—

నన్ను నేను క్షమించుకోలేను. నా మీద నాకే జుగుప్స కలిగింది. నాకు గతం ఉంది. వర్తమానాన్ని సృష్టించుకున్నాను.

సుధకి గతం లేదు. ఆమె నాకు భార్య కాగలిగింది.

నాకూ గతం ఉండకూడదు. గతం నన్ను బాధిస్తూ ఉంటే సుధకి నా ముఖం చూపించలేను. నన్ను నేను క్షమించుకోలేను.

సూర్యుడు ఆకాశంలో పైపైకి వస్తుంటే—

నేను ఆ ఇల్లు విడిచి,

ఆ ఇంటికి దూర దూరంగా వెళ్ళాను.

## 18

అది అంతా గతం.

మనసులో అశాంతి నింపుకుని, శాంతికోసం పరిభ్రమిస్తున్నాను ఈ నాడు.

నీతి!

నేను ఇల్లు వదిలి వచ్చాను. ఆ రావటంలో నా నీతి ఏమైంది!

ఏదైనా జరిగిపోయాక కానీ మనం మంచి చెడ్డలు నిర్ణయించలేము! జరుగనున్నదాని ఫలితం వర్తమానంలో నిర్ణయించలేము.

వర్తమానంలో అదే కర్తవ్యం అనుకున్నదానిని గురించి భవిష్యత్తులో పశ్చాత్తాప పడతామని ఊహించలేము.

విధి అనేది కాలగర్భంలో దాగిన రహస్యం. అది సమయ మాసన్నమయితే కానీ తెలియదు. అసలు కాలగర్భంలో దాగిన విధి అని ఒకటి ఉండకనూ పోవచ్చు. విధి తన త్రోవ తానే ఏర్పరచుకుంటూ కాలంతో సాగనూ వచ్చు.

కానీ—

విధి అనేది లేదని నమ్మనీయడు భగవంతుడు! అసలు నేను సుధని చూడటం జరగకపోతే నా జీవితం ఏమై యుండేది!

గొప్ప పనులు చేయకపోవచ్చు— ప్రపంచ నాగరికతకి ఉపయోగపడకపోవచ్చు— కానీ ఈ నాడు అర్థ రహితమైపోయింది నాజీవితం, నీతి కారణంగా. నీతికి ఎందుకు అంత విలువ? జీవితాన్ని నిరుపయోగం చేసేటంత విలువ నీతికి ఎవరు ఇచ్చారు? సంఘం ఇచ్చిందా? నేనే ఇచ్చుకున్నానా?

**19**

అశాంతి మనసు నిండా నింపుకుని సుధను విడిచి ఇల్లు వదిలి బయలు దేరాను నేను. ఇంకా నా హృదయం కన్నీటి కాలువకు— పన్నీటి నవ్వులకు మధ్య ఊగటం మానలేదు. శాంతి మనసులోనే ఉంటుంది అని తెలుసుకోటానికి రెండేళ్ళు గడిచి, సగం దేశం తిరిగాను. మనిషి ఎంత వెర్రివాడు! తన దాపులో ఉన్న తనలో ఉన్న నిధుల్ని— ఆనందమిచ్చే గుణాలను సాధనలను తెలుసుకోలేక ఎండమావులలో పరిభ్రమిస్తాడు. జీవితమంతా వృధా చేసుకుంటాడు.

భగవంతుడి నిర్దేశ మదేనేమొ! జ్ఞాని ఐనవాడికి ప్రపంచంతో సంబంధం లేదు. అవసరం లేదు. బ్రతకటానికి కొంత అజ్ఞానం, అన్వేషణా కావాలి. గమ్యం లేని అన్వేషణ, అజ్ఞానం— అతడిని ఈ జీవిత చక్రంలోనే తిప్పుతూ ఉంటాయి. ఈ చక్రంలోనించి బయట పడిన నాడు మానవుడు కాడు అతడు.

**20**

ఒక నాడు నీతిని గురించి అతిగా ఆలోచించాను. ఆలోచన కంటె అధికంగా

బాధపడ్డాను. అసలు నీతికి అర్థం ఉందా? ఈ ప్రపంచంలో జాతికొక నీతి ఉంది. ఒక జాతి స్వభావ పరిస్థితుల కనుకూలంగా ఆ జాతి నీతి ఏర్పడింది. కాల క్రమాన ఒక జాతి నీతి మారినా ఆశ్చర్యపడ నవసరం లేదు. మారుతూనే ఉంటుంది కూడాను.

సంతానం లేని స్త్రీ దేవర న్యాయం పాటించవచ్చు.

వితంతువైన స్త్రీ పునర్వివాహం చేసుకుంటోంది.

మగడితో మనసు కలవని స్త్రీ విడిపోయి మారుమను వాడవచ్చు.

స్త్రీ జనాభా తక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక స్త్రీ నలుగురు భర్తల్ని భరిస్తుంది.

నీతి ఎక్కడ ఉంది! నీతికి అర్థం ఏమిటి?

ఆ జాతి నీతిని అధిగమించకపోవటమే నీతి. మనిషి అలవాటుకి బానిస. సంప్రదాయకమైన నీతికి విరుద్ధం సహించలేడు మనిషి.

నీతికి అర్థం లేదు కాని నీతికి అవసరం ఉంది.

బాధ, ద్వేషం, దుఃఖాల నుంచి మనిషిని రక్షిస్తుంది.

నీతి దుఃఖాన్ని కలిగించవచ్చు కానీ అది యెద రగిలించదు. పగ కలిగించదు.

స్వార్థానికి, అసూయకి, దుఃఖానికి మానవుడు అతీతుడైన నాడు ఈ భూమి మీద నీతి యొక్క అవసరం లేదు!

ఆ పరిస్థితిలో ప్రతి ఒకడూ మహాత్ముడు కావాలి.

కానీ—

మనిషి వీటికి అతీతుడు కావటంలేదని కాలం యొక్క చరిత్ర చెబుతున్నది.

ఒక యుగానికి, కొన్ని కోట్ల జనాభాకి ఒక మహాత్ముడు మాత్రమే సంభవిస్తున్నాడు.

కానీ—

నీతికి అంతటి విలువ— ఒక బ్రతుకును శూన్యం చేసేటంత విలువ ఈయటం అవసరమా?

ఈ సమస్యను

కాలం

అనేక నాగరికతలలో, తరాలలో చర్చిస్తూ— ప్రయోగాలు చేస్తూ సాగిపోతూనే ఉంది.

సత్యాన్ని ఆవిష్కరించకుండానే సాగిపోతూ ఉంది.

కాలం,

నీతి కులమని చోట నిలబడిన నావంటి వారిని దుఃఖానికి ఎరవేస్తూ సాగిపోతూనే ఉంది.

నిజం తెలిసినంత మాత్రాన దుఃఖం నివారణ కాదు. దుఃఖ నివారణకు కొంత కాలం, మనసుకు సాధన కావాలి.

సుస్థిరమైన హిందూధర్మం పాత సంప్రదాయాలను వదలి కొత్త నీతిని విరచించుకో వలసిన సమయం ఆసన్నమయిందా?

నీతి లేక విశ్వశాంతి సాధ్యమా?

విశ్వశాంతి!

నా యీ ఒక్క జీవితాన్నే ఆవరించుకుని అశాంతి ఉంది. ప్రపంచ శాంతిని ఊపివేసే అశాంతికి వేరు ఉంది.

నా అశాంతిలో బాధ, ద్వేషం నశించిపోయాయి.

ఇంకా దుఃఖం మిగిలి ఉంది.

నేను ఇల్లు వదిలి వచ్చాను. రావటంలో నా నీతి ఏమయింది? రెండేళ్ళు నా శాంతికోసం పరిభ్రమించాను.

నా ఆనందం, నా ద్వేషం, నా శాంతి, నా బాధ్యత, నా పశ్చాత్తాపం... వీటిని గురించే మధనపడుతూ బ్రతికాను ఇన్నాళ్ళూ. సుధని గురించి ఆలోచించానా ఒక్క నాడైనా?

## 21

ఆశ్రమం నుంచి తీసుకువచ్చాను. ఆమె బాధ్యత నాది అన్నాను. నా రక్షణ ఆమెకి ఉందన్నాను. అన్నిటినీ మరిచి విడిచి వచ్చాను.

సుధ ఎట్లాగ ఉంది? ఎంత దుఃఖపడుతుంది? అని ఆలోచించానా?

యోగిని వంటి ఆమెను ఆశించి, తిరిగి బ్రతుకు పిపాస కలిగించి ఆమెను గురించి ఆలోచించకుండానే నిర్దాక్షిణ్యంగా వదిలి వచ్చాను.

ఎప్పుడూ తప్పులు చేస్తూ, దిద్దుకుంటూ ఉండటమేనా జీవితం?

నాకు అన్నీ తెలుసనీ ఆనందమే నావంతనీ ఆరంభించాను జీవతం.

జీవతంలో తప్పులు చేయక తప్పదా?

తప్పదు.

సుధ దగ్గరకు వెళ్ళాలి.

ఆమె క్షమ నర్థించాలి.

ఆమె నన్ను క్షమించటమే నన్ను నేను క్షమించుకోవటం.

అదే శాంతి.

ఇంటికి—

సుధ దగ్గరకు వెళ్ళటానికి—

నిశ్చయించుకున్నాను.

ఇల్లు వదలిన మూడేళ్ళకు తిరిగి వచ్చాను.

తలుపులు తీసి ఉన్నాయి.

వరండా దాటి గదిలో అడుగు పెడుతుంటే—

కిటికీలోనించి ప్రసరించే సూర్యుడి సంజ కాంతుల్లో సుధా—

చీకటి, వెలుగు సంయోగం చెందుతున్న సంజ కాంతుల్లో సుధా—

సుధ ఒడిలో రెండేళ్ళ బాలుడూ—

కూర్చుని ఉన్నారు.

ఎవరా పిల్లవాడు?

ఎందుకిక్కడ ఉన్నాడు?

సుధ కొడుకేనా?

ఎవరికి పుట్టాడు? నా లోపలికి కళ్ళకి ఏవో దుఃఖపు పొరలు కమ్ముకుంటున్నాయి.

నాకు తెలిసింది, మళ్ళీ నా హృదయం కన్నీటి కాలువలోకి నన్ను విసురుతోంది.

''సుధా!'' అన్నాను.

బాధో, నిరాశో, సందేహమో తెలియని నీరసంతో.

సుధ అవే నయనాలతో నిశ్చలమైన చూపులతో నన్ను చూస్తోంది.

సుధ కనులలో ఆ వెలుగు తరగలేదు.

ఆమె నన్ను గుర్తించింది.

''ఎవరమ్మా?'' కుతూహలంతో ప్రశ్నించాడు పిల్లవాడు నన్ను చూస్తూ.

ఆమె కదలలేదు.

కానీ

ఆమెలోని స్పందన నాలో ప్రతిస్పందించింది.

''ఎవరమ్మా?'' ఆ బాలుడి సుకుమారమైన కంఠం ప్రశ్నించింది.

నాలో ప్రతి అణువు ఒక గొంతుకగా లెక్క లేనన్ని కంఠాలు నాలో తలెత్తి ప్రశ్నించాయి.

''చెప్పు సుధా, ఎవరినో చెప్పు. నేను ఎవరినో చెప్పు.''

సుధ పెదవులు కదిలాయి.

''మీ నాన్నగారు....''

నా గుండెలో గుడి గంటలు మ్రోగాయి.

నా సంభ్రమం ఏమని చెప్పను! నా కొడుకేనా? నా బ్రతుకులో నాకు తెలియకుండానే ఇంత ఆనందమా? రహస్యమా?

సంతోషాన్ని మించిన అనుభూతితో ముందుకు వెళ్ళి—

''సుధా, నన్ను క్షమిస్తావా?'' అన్నాను.

సుధ ఒడిలోనించి లేచి పిల్లవాడు నుంచున్నాడు.

సుధ కూడా లేచి నిలబడింది.

''అవసరం లేదు. మీరు నన్ను క్షమించారు.

ఆ రాత్రి

నా జీవితానికంతకూ చాలిన మధురానుభూతిని నాకు ప్రసాదించారు. నా బ్రతుకు నంతటినీ అలమివేసే తృప్తిగా, ధ్యేయంగా వీణ్ణి అందించారు. నాకు ఇంకేమీ అవసరం లేదు. మీరు నాపట్ల న్యాయానికంటె ఎక్కువగా ప్రవర్తించారు.'' అంది సుధ.

''కానీ సుధా, నాకు శాంతి లేదు. నువ్వు క్షమిస్తే కానీ నన్ను నేను క్షమించుకోలేను.'' అన్నాను.

సుధ దగ్గరగా వచ్చింది.

''క్షమ అని అడగకండి. నేను మీ భార్యని'' అంది.

''సుధా!'' అని ఆమెను ఆలింగనం చేసుకున్నాను.

ఆ క్షణంలో గతం అంతా కరిగిపోయింది.

''అవును. సుధ నా భార్య. నా జీవన సుధ'' అని నా హృదయం లోలోపల పరవళ్ళు తొక్కింది.

* * * *